సాక్షి
మహబూబాబాద్
సోమవారం | 18 నవంబర్ | 2024



ఏపీ కేసులకు..ఏపీ సెక్షన్లు

రైల్వేలో క్రైం రేట్‌ను తగ్గించేందుకు ఆర్‌పీఎఫ్ పోలీసులు కృషి చేస్తున్నారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. - 8లో ▸



'రావెప్' విద్యార్థులకు వరం

గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం వ్యవసాయ కళాశాల విద్యార్థులకు వరమవుతోంది. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.3⁰/16.4⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం సాధారణంగా ఉంటుంది. రాత్రి సమయంలో చలితో పాటు మంచు కురుస్తుంది.

పర్యవేక్షణ లేక..!

గాడి తప్పుతున్న మోడల్ స్కూల్స్

- తప్పతాగి బాలికల హాస్టళ్ల వద్ద యువకుల వీరంగం
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



సాక్షి, మహబూబాబాద్:

'ఓ మోడల్ స్కూల్‌లో నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా కార్యక్రమం జరుగుతుంటే అదే పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు తాగిన మైకంలో ఇష్టారాజ్యంగా ప్రవర్తించారు. అక్కడి నుంచి ఉపాధ్యాయులు వారిని హెచ్చరించి వెళ్లగొట్టారు. బయటకు వెళ్లిన విద్యార్థులు మళ్లీ గోడదూకి వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో ఆగ్రహానికి గురైన ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు'.

జిల్లాలోని తెలంగాణ మోడల్ స్కూళ్లలో తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లోని మెరికల్లాంటి పిల్లల ప్రతిభను బయటకు తీసి ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్స్ ఇబ్బందికరమైన వాతావరణంలో నడుస్తున్నాయి. ఉన్నత చదువులు చదివేందుకు సిద్ధం కావాల్సిన విద్యార్థులు గాడి తప్పుతున్నారు.

పర్యవేక్షణ కరువు

జిల్లాలోని టీఎస్‌ఎంఎస్‌లు ఎవ్వరికీ పట్టని విద్యాలయాలుగా మారాయని విమర్శలు వస్తున్నాయి. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు పూర్వ మండలాల్లో ఈ పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మరిపెడ, డోర్నకల్ (చిలుకోడు), నర్సింహులపేట, మహబూబాబాద్, తొర్రూరు, నెల్లికుదురు, కురవి(సేరడ), కొత్తగూడలో మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలల్లో మొత్తం 4,480 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతీ స్కూల్‌లో 100 మంది చొప్పున ఇంటర్ విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పించారు. అయితే, ఇందులో మరిపెడ, డోర్నకల్ (చిలుకోడు) మోడల్ స్కూళ్లలో వర్కర్లు, వసతులు లేని కారణంగా హాస్టళ్లు పనిచేయడం లేదు. పోగా మిగిలిన ఆరు స్కూళ్లలో 600 మంది విద్యార్థినులకు బదులు 409 మంది మాత్రమే ఉంటున్నారు. ప్రభుత్వం విద్యార్థులపై పర్యవేక్షణ చేసేందుకు మాత్రం చర్యలు చేపట్టడం లేదు.

రాత్రి అయితే భయం భయంగా..

జిల్లాలోని ఉన్న పలు మోడల్ స్కూళ్ల హాస్టళ్ల వద్ద రాత్రి అయితే కొంతమంది ఆకతాయిలు వచ్చి మద్యం సేవించడం, సిగరేట్లు తాగడం వంటి పనులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి ఘటనలతో భయం భయంగా గడపాల్సి వస్తోందని విద్యార్థినులు తల్లిదండ్రుల ముందు వాపోతున్నారు. వాచ్‌మెన్‌ను ఎదిరించి కొందరు లోపలికి వస్తున్నారని, మరికొన్ని చోట్ల ప్రహరీ దూకి, హాస్టల్ కిటికీ అద్దాలు పగులగొట్టుకొని లోపలికి వచ్చి వీరంగం సృష్టించడం పరిపాటిగా మారింది. అదేవిధంగా గంజాయి, మద్యం, సిగరేట్లు తాగుతూ స్కూళ్ల పరిసర ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా వచ్చి ఇబ్బందులు పెడుతున్నారని విద్యార్థినులు చెబుతున్నారు. అయితే వీటిని అరికట్టాలిసిన ప్రిన్సిపాళ్లు, కేర్ టేకర్, ఏఎన్‌ఎంలు బాలికలపై జులుం చూపించి ఇబ్బందులు పెడుతున్నారని పిల్లలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పోలీస్‌శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించాలని, మద్యం, గంజాయికి బానిసలు కాకుండా అవగాహన కల్పించాలని, హాస్టళ్ల పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పోలీసుల నిఘా పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

జిల్లాలోని పలు మోడల్ స్కూళ్ల హాస్టళ్లలో రాత్రి వేళ మగ పిల్లలు వెళ్లడం, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయి. పూర్తి స్థాయి నివేదికను తెప్పిస్తున్నాను. ఆ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సంఘటనలు పునరావృతం కాకుండా అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

\- డి.రాజేశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి

తొలిరోజు గ్రూప్‌-3 ప్రశాంతం



బోర్డుపై హాల్ టికెట్, గది నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



చంటి పిల్లవాడితో పరీక్ష కేంద్రానికి వచ్చిన అభ్యర్థి

- పరీక్షకు ఆలస్యంగా వచ్చిన 25మంది అభ్యర్థులు వెనక్కి
- 7,592 మందికి 4,349 మంది హాజరు
- సెంటర్లను పరిశీలించిన ఎస్పీ, అదనపు కలెక్టర్

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో గ్రూప్‌- 3 మొదటి రోజు పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8:30గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులను కానిస్టేబుళ్లు పరిశీలించారు. అనంతరం అధికారులు బయోమెట్రిక్ నమోదు చేసి పరీక్ష గదుల్లోకి అనుమతించారు. పలువురు మహిళలు చంటి పిల్లలతో కేంద్రాలకు తరలివచ్చారు.

25మంది ఆలస్యం

పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన 25మంది అభ్యర్థులను పరీక్ష రాసేందుకు అధికారులను లోపలికి అనుమతించలేదు. సెంటర్ అడ్రస్ తెలియని పలువురిని పోలీసులు దగ్గరుండి కేంద్రాలకు సాగనంపారు. ఉదయం నిర్వహించిన మొదటి పేపర్ పరీక్షకు అభ్యర్థులను 9:30 గంటల వరకు అనుమతించి అనంతరం గేట్లను మూసివేశారు. సెకండ్ పేపర్ పరీక్ష మధ్యాహ్నా 3నుంచి సాయంత్రం 5:30గంటల వరకు జరిగింది. మొదటి రోజు 7,592 మంది అభ్యర్థులకు గాను 4,349 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 3,243 మంది గైర్హాజర య్యారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 57.28 శాతం మంది హాజరుకాగా మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 4,350 మంది హాజరు కాగా అభ్యర్థుల హాజరు శాతం 57.29గా నమోదు అయ్యింది.



పరీక్ష రాసేందుకు కేంద్రానికి వస్తున్న గర్భిణి



పరీక్ష రాసేందుకు సెంటర్‌కు వస్తూ..

పోలీసుల బందోబస్తు

జిల్లా వ్యాప్తంగా 21పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం పకడ్బందీగా విధులు నిర్వహించి 163సెక్షన్ అమలు చేశారు. ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అదే విధంగా ఎఫ్‌ఆర్‌ఓ సెంటర్, రైల్వే స్టేషన్, నెహ్రూ సెంటర్, తొర్రూర్ బస్‌స్టాండ్ సెంటర్, బాంబు స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లాలోని ప్రత్యేకాధికారులు జిల్లాలోని 21 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. 21 పరీక్ష సెంటర్లకు చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు 6, జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు 24, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 10, ఐడెంటిఫికేషన్ అధికారులు 86 మంది విధులు నిర్వహించారు.

న్యూస్‌రీల్

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



మహబూబాబాద్ రూరల్: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో తల్లాడ వెంకన్న మామిడి తోటలో ఆదివారం శ్రీవాసవ సేవా ట్రస్టు, కామధేను గోశాల ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. 108 మంది దంపతులు పాల్గొని సత్యనారాయణ స్వామివారు, శివకేశవులకు పూజలు చేసి తమను అనుగ్రహించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గద్రెపల్లి వెంకటేశ్వర్లు, సంకా శేఖర్, గోపు రాము, జంగాల వెంకట్, సోమ శ్రీను, ఓలం విద్యాసాగర్, దొడ్డ సోమేశ్వర్, వేములపల్లి వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



బయ్యారం: మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఏఎంసీ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఓ రాంజీ తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యం తగదు..



పెద్దవంగర: ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం చేయడం తగదని తొర్రూరు ఆర్డీఓ గణేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ, తొర్రూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మహేందర్‌తో కలిసి ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి కేటాయించిన మిల్లులకు తరలించాలన్నారు. అదే విధంగా రైతులు నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ స్వామినాయక్, ఆర్‌ఐ భూక్యా లస్కర్, రైతులు పాల్గొన్నారు.

బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

మహబూబాబాద్ రూరల్ : ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. గ్రూప్ -3 పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పరీక్ష కేంద్రాలు, బస్టాండ్, ఆటవీ కార్యాలయ సెంటర్, రైల్వే స్టేషన్, నెహ్రూ సెంటర్, తొర్రూర్ బస్టాండ్ సెంటర్ ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. అడ్మిన్ ఆర్‌ఐ అనిల్ ఆధ్వర్యంలో బాంబ్ స్క్వాడ్ టీం సభ్యులు అంజయ్య, రాజు, కృష్ణ, యాకయ్య తనిఖీలు నిర్వహించారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్



డోర్నకల్: సీపీఎం జిల్లా కార్యదర్శిగా సాదుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. డోర్నకల్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా మూడవ మహాసభలో ఆదివారం సాదుల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2017 నుంచి రెండు పర్యాయాలు జిల్లా కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్ అనేక ప్రజా ఉద్యమాలను పార్టీ తరఫున ముందుండి నడిపించి తనదైన ముద్ర వేశారు. మహాసభలో జిల్లా కార్యదర్శితో పాటు ఎనిమిది మంది జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, 16 మంది జిల్లా కమిటీ సభ్యులతో పాటు కో ఆప్షన్ సభ్యుడిని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా శెట్టి వెంకన్న, గునిగంటి రాజన్న, సూర్నపు సోమయ్య, అల్వాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, ఆకుల రాజు, కుంట ఉపేందర్ ఎన్నికయ్యారు.

క్రీడలకు పుట్టినిల్లు మానుకోట



విజేతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్ అర్బన్: క్రీడలకు పుట్టినిల్లు మానుకోటని ఇక్కడ నుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో చాలా మంది క్రీడాకారులు రాణించారని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో ఆదివారం రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించగా ఎమ్మెల్యే మురళీనాయక్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. మానుకోట నియోజకవర్గం నుంచి చాలా మంది క్రీడల్లో ముందుస్థానంలో నిలిచారన్నారు. బాలికలు సైతం కరాటేలో మెలకువలు నేర్చుకుని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా కరాటే పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఊరుకొండ చంద్రశేఖర్, కోచ్ వీరన్న, పోలీస్ కరాటే కోచ్ పాయం సురేష్, సీనియర్ కరాటే మాస్టర్లు కాసీం, గఫర్, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఉద్యోగస్తుల కుటుంబాలకు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0కార్యక్రమాన్ని డిపో డీఎం ఎం.శివప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో ఉన్న 300మంది కార్మికుల భార్య, భర్తలకు పూర్తి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేయాలన్నారు. ఏదేమైనా ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని టీజీఎస్‌ఆర్టీసీ తార్నాకా హాస్పిటల్ హైదరాబాద్‌కు రెఫర్ చేయాలని తెలిపారు. 60మంది ఉద్యోగస్తుల కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, పాపిరెడ్డి, హెల్త్ వలంటీర్లు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో భక్తుల రద్దీ



దీపాలంకరణ

కాళేశ్వరం: కార్తీకమాసం ఆదివారం సెలవు కావడంతో కాళేశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి గర్భగుడిలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు చేశారు. ఉసిరి చెట్టు వద్ద పూజలు చేసి దీపాలు వెలిగించారు. లక్షముగ్గులు వేసి లక్షవత్తులు వెలిగించి దీపారాదన చేశారు. బ్రాహ్మణోత్తములకు దీపదానాలు చేశారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. సామూహిక దీపాలంకరణ నిర్వహించారు. దీపాలంకరణలో పాల్గొన్న భక్తులకు పసుపు, కుంకుమ, అక్షింతలు అందజేశారు. దీంతో ఆలయంతో పాటు గోదావరి తీరం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం వివిధ పూజలు, లడ్డూప్రసాదాల ద్వారా రూ.4.25లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణుడికి దీపదానం చేస్తున్న భక్తులు

జిల్లా ప్రగతి నివేదిక సిద్ధం చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: రేపు సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ పర్యటన నేపథ్యంలో జిల్లా ప్రగతి నివేదిక సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆదివారం రేపు హనుమకొండలో జరిగే సీఎం ప్రజాపాలన కార్యక్రమం, రాష్ట్ర జిల్లా స్థాయి కళాయాత్ర ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పరిపాలన పూర్తి అవుతున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 28న జిల్లా కేంద్రంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. రేపటి నుంచి డిసెంబర్ 7వరకు జిల్లాలోని సాంస్కృతిక సారథులచే ప్రజాపాలన కళాయాత్ర నిర్వహించుటకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. మూడు కళాబృందాలు ప్రతీరోజు మూడు గ్రామాలలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఏర్పాట్లు ఇతరత్రా విషయాలపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి, డీపీఆర్‌ఓ రాజేంద్రప్రసాద్, కలెక్టరేట్ ఏఓ పవన్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రచారం



పోలీసులు ముద్రించిన బ్రోచర్

మహబూబాబాద్ రూరల్ : సైబర్ నేరాలపై ప్రజలు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నప్పటికీ ప్రతిరోజూ ఏదో రకంగా సైబర్ నేరగాళ్లు తమ తెలివిని ఉపయోగిస్తూ నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు. దీంతో ప్రజలు ఆర్థికంగా నష్టపోతూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై జిల్లా పోలీసులు విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ఆగండి.. ఆలోచించండి.. చర్య తీసుకోండి.. తస్మాత్ జాగ్రత్త అంటూ సైబర్ బెదిరింపులు వస్తే పోలీసులకు ఏవిధంగా ఫిర్యాదులు చేయాలనే అంశాలపై చైతన్యం కల్పిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల మోసాల పేరిట మహబూబాబాద్ జిల్లా పోలీసులు సోషల్ మీడియా వేదికగా ప్రచారం నిర్వహిస్తూ బ్రోచర్లను తయారుచేసి విస్తృత ప్రచారం చేస్తున్నారు.

విభజన చట్టాన్ని విస్మరించిన కేంద్రం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య



మాట్లాడుతున్న నాగయ్య

డోర్నకల్: కేంద్ర ప్రభుత్వం విభజన చట్టాన్ని విస్మరించి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. స్థానిక వై.వెంకటయ్య నగర్‌లోని బిషప్ అజరయ్య ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా మహాసభల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటును నాసిరకం ముడిసరుకు వంకతో పట్టించుకోలేదన్నారు. అక్షరాస్యత, వైద్య, విద్యారంగాల్లో వెనుకబడిన, గిరిజనులు ఎక్కువగా ఉన్న మహబూబాబాద్ జిల్లాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. డోర్నకల్ రైల్వే జంక్షన్ నిర్వీర్యానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని, మిర్చి, పత్తి పంటల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ధ్వంసమైన ఎస్సారెస్పీ కాల్వల మరమ్మతుల పేరుతో వంద కోట్ల రూపాయలను కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు పంచుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ మోసగిస్తుందన్నారు. అభివృద్ధి, హామీలను విస్మరిస్తే ప్రజలు నాయకులను రోడ్లపై నిలదీస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టి వెంకన్న, గునిగుంటి రాజన్న, సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, అల్వాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, నాయకులు బీఆర్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు..

బుగులోనికి భారీగా భక్తజనం

- కిటకిటలాడిన స్వామి సన్నిధి
- జాతర ప్రాంగణంలో విడిది

రేగొండ: మండలంలోని తిరుమలగిరి శివారులో జరుగుతున్న శ్రీ బుగులోని వేంకటేశ్వరస్వామి జాతరకు నాలుగో రోజు భక్తులు భారీగా తరలివచ్చారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం వేలాదిమంది వచ్చి మొక్కులు సమర్పించారు. భక్తులు భారీగా తరలిరావడంతో జాతర ఆవరణమంతా భక్తిభావంతో ఉప్పొంగింది. భక్తుల గోవింద నామస్మరణతో గుట్ట మార్మోగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా గుట్టపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్‌రెడ్డి జాతరకు హాజరై మొక్కులు చెల్లించారు.

పోలీసుల సేవలు..

జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చిట్యాల సీఐ మల్లేష్, ఎస్‌ఐ సందీప్‌కుమార్ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో అడుగడుగునా పోలీసుల సేవలు కనిపించాయి. పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూశారు.



గర్భగుడిలో స్వామి వారు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

జాతర కమిటీ ఏర్పాట్లలో నిమగ్నం

జాతరలో మొదటి రోజు భక్తులు ఇబ్బందిపడడంతో జాతర కమిటీ ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమైంది. భక్తుల సౌకర్యార్థం తాగునీటిని ఏర్పాటు చేశారు. జాతర ఈఓ బిల్లా శ్రీనివాస్, చైర్మన్ రొంటాల వెంకటస్వామి, కమిటీ సభ్యులు రమణారెడ్డి, విజేందర్, రాజేందర్, శ్రీధర్, శివ, తిరుపతి ఏర్పాట్లను పరిశీలించారు.

క్లుప్తంగా

మామునూరు ఎయిర్‌ పోర్టుకు రూ. 205 కోట్లు

- రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

హన్మకొండ చౌరస్తా: మామునూరు ఎయిర్‌ పోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 205 కోట్ల నిధులు కేటాయిస్తూ జీఓ విడుదల చేసింది. ఇందుకు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. వరంగల్‌ ప్రజల చిరకాల వాంఛ అయిన మామునూరు ఎయిర్‌ పోర్టుకు మోక్షం లభించడం సంతోషంగా ఉందన్నారు. దీంతో పాటు వర్షాకాలంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్‌ పార్కుకు పొంచి ఉన్న ముంపును నివారించేందుకు అవసరమైన పనులు చేపట్టే నిమిత్తం రూ.160.92 కోట్లు విడుదల, భూసేకరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు 863 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌ రెడ్డికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్‌

రఘునాథపల్లి: మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో తాపీ మేస్త్రీ గంపల పరశురాములును హత్య చేసిన అదే గ్రామానికి చెందిన పర్వత మహేందర్‌ను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్టేషన్‌ఘన్‌పూర్‌ ఏసీపీ భీంశర్మ ఆదివారం తెలిపారు. ఈ నెల 14న పరశురాములును మహేందర్‌ కత్తితో నరికి చంపాడు. మహేందర్‌ వద్ద పరశురాములు అప్పు తీసుకోగా.. ఆ డబ్బులు అడిగే విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. పరశురాములు అవమానించాడని మహేందర్‌ పగ పెంచుకున్నాడు. ఈ నెల 14న పలుమార్లు తన ఇంటికి రావాలని ఫోన్‌ చేయడంతో అర్ధరాత్రి 12.45 గంటల సమయంలో పరశురాములు వెళ్లాడు. అప్పటికే కత్తితో సిద్ధంగా ఉన్న మహేందర్‌ తన ఇంటి ముందుకు పరశురాములు రాగానే నన్ను అవమానిస్తావా అంటూ తలపై విచక్షణారహితంగా నరికాడు. దీంతో పరశురాములు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన అనంతరం పరారీలో ఉన్న మహేందర్‌ ఆదివా రం రఘునాథపల్లి రైల్వే స్టేషన్‌ సమీపంలో సంచరిస్తుండగా అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ తెలిపారు.

బాలికను వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్‌



యాకు అరెస్ట్‌ను చూపుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

దేవరుప్పుల : బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి తనవెంట పడుతూ వేధిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని బోడబండ తండాకు చెందిన ధరావత్‌ యాకు.. ఓ బాలికను వివాహం చేసుకుంటానని తరచూ వేధిస్తున్న విషయమై బాధిత తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిగా భావిస్తున్న యాకును అరెస్ట్‌ చేసి రిమాండు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇలాంటి వేధింపులకు ఎవరూ పాల్పడిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సీఐ మహేందర్‌రెడ్డి వెంట సిబ్బంది యాకూబ్‌, అశోక్‌ ఉన్నారు.

‘రావెప్‌’ విద్యార్థులకు వరం

- రైతులతో మమేకమై పంటల సాగులో మెళకువలపై ఆరా
- 90 రోజులపాటు ఎంపిక చేసిన గ్రామాల్లో క్షేత్ర సందర్శన



క్షేత్ర సందర్శనలో మెళకువలు నేర్చుకుంటున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

మహబూబాబాద్‌ రూరల్‌ : గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం (రావెప్‌).. వ్యవసాయ కళాశాల విద్యార్థులకు వరమవుతోంది.. 90 రోజుల పాటు రైతులతో మమేకమై పంటల సాగులో అవలంబిస్తున్న మెళకువల గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడుతోంది. ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వరంగల్‌ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్‌ చివరి సంవత్సరం చదువుతున్న పలు జిల్లాలకు చెందిన విద్యార్థులు మహబూబాబాద్‌ జిల్లాలోని ఎంపిక చేసిన పర్వతగిరి, కల్వల, ఇనుగుర్తి, అమీనాపురం, కంబాలపల్లి, బయ్యారం గ్రామాలకు చేరుకుని రావెప్‌లో భాగంగా గ్రామాల్లోనే ఉంటూ రైతులతో మమేకమవుతున్నారు. మూడేళ్ల పాటు తరగతి గదిలో నేర్చుకున్న వ్యవసాయ విజ్ఞాన అనుభవాలను రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో ఎలా ఉంటాయో తెలుసుకునేందుకు పొలంబాట పట్టారు. ఈ విద్యార్థులందరూ మహబూబాబాద్‌ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్‌ ఎస్‌.మాలతి పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

వంద రోజులు రైతులతో మమేకం..

మల్యాల కేవీకే సమన్వయకర్త మాలతి, ప్రోగ్రాం ఇన్‌చార్జ్‌, సైంటిస్టు డాక్టర్‌ కిశోర్‌ కుమార్‌ ఆధ్వర్యంలో వరంగల్‌ వ్యవసాయ కళాశాల విద్యార్థులు వందరోజుల పాటు పూర్తిగా ఎంపిక చేసిన గ్రామాల్లోనే ఉంటూ రైతులతో పొలంబాట పట్టి తాము తెలుసుకున్న అంశాలను గురించి వివరిస్తూ నేర్పిస్తున్నారు. అంతేకాకుండా రైతుల నుంచి ఎన్నో అనుభవాలను నేర్చుకుంటున్నారు. 25 మంది విద్యార్థులు ఎంపిక చేసిన గ్రామాల్లో నివాసముంటూ పత్తి, మిరప, వరితో పాటు ఇతర పంటల్లో రైతులు సాగు మొదలుపెట్టినప్పటి నుంచి.. దిగుబడులు చేతికి వచ్చేంతవరకు వారు అవలంబిస్తున్న యాజమాన్య పద్ధతులు, ఇతర అంశాలను అధ్యయనం చేస్తున్నారు. పంటలకు పొలం సిద్ధం చేయడం, విత్తనాలు నాట డం, మొలకెత్తడం, పూత, కాత, పంటలు చేతికొచ్చే అంశాలు, ఆయా పంటల సాగు సమయంలో ఆశించే చీడపీడలు, ఇతర అనుకూల, ప్రతికూల వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తున్నారు. వంద రోజుల క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు వారికి సహకరిస్తూ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు.

రైతుల కష్టాల గురించి తెలుస్తుంది..



రావెప్‌ కార్యక్రమం ద్వారా తరగతి గదిలో నేర్చుకున్న ప్రతి అంశం రైతు పంట క్షేత్రంలో ఏ విధంగా పనిచేస్తాడో తెలుసుకోవడానికి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. అదేవిధంగా విద్యార్థులు గ్రామంలో ఉండడం ద్వారా ప్రత్యక్షంగా రైతుల బాధలు తెలుసుకోవడంతో పాటు వారు పంటల సాగు సమయంలో అవలంబిస్తున్న పద్ధతుల గురించి తెలుసుకుంటారు.

-డాక్టర్‌ ఎస్‌.మాలతి, మల్యాల కేవీకే సమన్వయకర్త

సాగు సమస్యలు తెలుసుకుంటారు..



రావెప్‌లో భాగంగా ప్రతి సంవత్సరం విద్యార్థులు మల్యాల కృషి విజ్ఞాన కేంద్రానికి విచ్చేస్తారు. వారిని గ్రామాల్లో రైతులకు అనుసంధానం చేయడం ద్వారా వ్యవసాయంలో ఉన్న సమస్యలు తెలుసుకుంటారు. రైతుల అవలంబిస్తున్న వివిధ పంటల సాగు విధానాలను తెలుసుకుంటారు. రైతులు చెప్పే అంశాలతో పాటు విద్యార్థులు కూడా కొత్త అంశాలను అన్నదాతలకు చెబుతారు.

-డాక్టర్‌ ఎన్‌.కిశోర్‌ కుమార్‌, శాస్త్రవేత్త, మల్యాల కేవీకే

రైతులతో పరస్పర చర్చలు ..



నేను వరంగల్‌ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్‌ 4వ సంవత్సరం చదువుతున్నా. మాకు నాలుగో సంవత్సరంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం ఉంటుంది. ఇందులో భాగంగా 90 రోజులపాటు మహబూబాబాద్‌ జిల్లా బయ్యారం మండలంలో ఉంటూ రైతులతో పరస్పర చర్చలు జరుపుతున్నాం. మేము చదివిన అంశానికి క్షేత్రస్థాయికి వ్యత్యాసం ఉంది. మేము గమనించింది ఏమంటే రైతులు సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం లేదు. చాలామంది రైతులు మందులు పిచికారీ చేసి నష్టపోతున్నట్లు గుర్తించాం. ఆ విధంగా చేయొద్దని కొంత మంది రైతులకు అవగాహన కల్పించాం.

-ఎస్‌. గోపీనాథ్‌, పరకాల

రైతుల ఇబ్బందులు తెలిశాయి..



నేను వరంగల్‌ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్‌ నాలుగో సంవత్సరం చదువుతున్న సమయంలో రావెప్‌ కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామంలో రైతులతో మమేకమైనప్పుడు వారి ఇబ్బందులు తెలిశాయి. రైతులు ఆధునాతన సాగు పద్ధతుల గురించి తెలుసుకుంటున్నారు కానీ రసాయన ఎరువుల వాడకం తగ్గించడం లేదు. రోజురోజుకూ పంటల దిగుబడిపై దృష్టి సారించడం కనిపించింది.

-జి.కావ్య, హైదరాబాద్‌

క్రాస్‌కంట్రీ టోర్నమెంట్‌కు కేయూ జట్లు



పురుషుల జట్టుతో స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వెంకయ్య

కేయూ క్యాంపస్‌: మంగళూరు యూనివర్సిటీలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించే ఆల్‌ ఇండియా జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీ క్రాస్‌కంట్రీ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ నుంచి పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేశారు. ఈ మేరకు ఆదివారం కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్‌ బోర్డు సెక్రటరీ వై.వెంకయ్య తెలిపారు. పురుషుల జట్టులో టి.శ్రావణ్‌కుమార్‌, డి.రాజు, ఆర్‌.రవితేజ(కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ హనుమకొండ), వి.స్టాలిన్‌ నాయక్‌ భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, టి.అనిల్‌ ఎస్‌ఆర్‌ అండ్‌ బీజీఎన్‌ఆర్‌ కళాశాల ఖమ్మం, ఎం.అఖిల్‌ ప్రియదర్శిని కళాశాల ఖమ్మం ఉన్నారు. ఉమెన్స్‌ జట్టులో ఎం.ఇందు, ఎం.సింధు ఎస్‌సీడబ్ల్యూడీసీ కొత్తగూడెం, ఎస్‌కే.సమ్రీన్‌ వీసీపీఈ బొల్లికుంట, పి.హర్షిత టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ డబ్ల్యూ కొత్తగూడెం, ఎస్‌.నర్మద యూసీపీఈ కేయూ వరంగల్‌, ఎ.లక్ష్మి టీటీడబ్ల్యూఆర్‌డీసీ ఉట్నూరు ఉన్నట్లు వెంకయ్య ఆదివారం వివరించారు. ఈజట్లకు వరంగల్‌ బొల్లికుంట వాగ్దేవి కాలేజీ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కళాశాల ఫిజికల్‌ డైరెక్టర్‌ పి.లక్ష్మీపతి కోచ్‌ కమ్‌ మేనేజర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు.



ఉమెన్స్‌ జట్టుతో స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వెంకయ్య

ఏఏ కేసులకు.. ఏఏ సెక్షన్లు..

- రైల్వే నిబంధనలపై ప్రయాణికులకు అవగాహన
- పాటించని వారిపై కేసులు నమోదు
- క్రైం రేట్‌ తగ్గింపునకు ఆర్‌పీఎఫ్‌ కృషి



సంజీవరావు, సీఐ ఆర్‌పీఎఫ్‌ కాజీపేట

కాజీపేట రూరల్‌ : రైల్వేలో క్రైం రేట్‌ను తగ్గించేందుకు కాజీపేట రైల్వే ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ పోలీసులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా రైల్వే నిబంధనలు పాటించని వారిపై వివిధ కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు రైల్వేశాఖ రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై 29 రకాల రైల్వే యాక్ట్‌ కేసులు పెట్టనున్నట్లు ఆర్‌పీఎఫ్‌ కాజీపేట సీఐ ఎం.సంజీవరావు తెలి పారు. ఈ నేపథ్యంలో ఏ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఏఏ సెక్షన్ల ప్రకారం.. ఏఏ కేసులు నమోదు చేస్తారో ఒకసారి తెలుసుకుందాం. కాగా, కాజీపేట ఆర్‌పీఎఫ్‌ పోలీస్‌స్టేషన్‌ కేంద్రంగా కాజీపేట–బీబీనగర్‌, పెద్దపల్లి, వరంగల్‌ ఆర్వోబీ వరకు 23 రైల్వే స్టేషన్ల పరిధి అడ్మినిస్ట్రేషన్‌ పరంగా ఆర్‌పీఎఫ్‌ పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు ఆర్‌పీఎఫ్‌ కాజీపేట సీఐ ఎం.సంజీవరావు తెలిపారు. కాజీపేట ఆర్‌పీఎఫ్‌ పోలీస్‌స్టేషన్‌కు ఔట్‌పోస్టులుగా భువనగిరి, డీజిల్‌లోకోషెడ్‌ ఉన్నాయని, మొత్తం 65 మంది పోలీస్‌ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని ఆయన వివరించారు.



కాజీపేట ఆర్‌పీఎఫ్‌ పోలీస్‌స్టేషన్‌

ఏఏ కేసులు.. ఏఏ సెక్షన్లు

సెక్షన్‌ 141 (రన్నింగ్‌లో ఉన్న ట్రైన్‌ చైన్‌ లాగడం) ప్రకారం రూ.వెయ్యి జరిమానా లేదా సంవత్సరం జైలు శిక్ష విధిస్తారు. సెక్షన్‌ 143 (టౌటింగ్‌–అనధికారికంగా రిజర్వ్‌ టికెట్‌ వేరే వారికి అమ్మడం) ప్రకారం రూ.10వేల జరిమానా లేదా 3 ఏళ్ల జైలు శిక్ష, సెక్షన్‌ 144 (రైళ్లలో, రైల్వే స్టేషన్లలో, రైల్వే ప్రాంతాలలో అనుమతి లేకుండా తినుబండారాలు విక్రయించిన, బెగ్గింగ్‌ చేసిన వారికి) ప్రకారం రూ.2వేల జరిమానా లేదా సంవత్సరం జైలు శిక్ష, సెక్షన్‌ 145 (ప్రయాణికుల పట్ల న్యూసెన్స్‌ చేసిన వారికి) ప్రకారం రూ.5వేల జరిమానా లేదా 6 నెలల జైలు శిక్ష, సెక్షన్‌ 146 (రైల్వే ఉద్యోగుల విధులను అటంకపరిచిన వారికి) ప్రకారం రూ.వెయ్యి లేదా 6 నెలల జైలుశిక్ష, సెక్షన్‌ 147 (రైలు పట్టాలు దాటిన, రైల్వే ఏరియాలోకి వచ్చిన వారికి) రూ. వెయ్యి లేదా 6 నెలల జైలు శిక్ష, సెక్షన్‌ 153 (రైళ్లపై స్టోన్‌ బెల్టింగ్‌, పట్టాలపై రాళ్లు పెట్టిన, ప్రయాణికులపై ఉద్దేశపూర్వకంగా దాడి చేసిన వారికి) ప్రకారం నాన్‌బెయిలబుల్‌ కింద 5 ఏళ్ల జైలు శిక్ష, సెక్షన్‌ 154 (యాక్సిడెంటల్‌గా, నిర్లక్ష్యం వల్ల రైల్వే ఆస్తుల ధ్వంసం గాని ప్రయాణికులపై దాడికి పాల్పడినవారికి) ప్రకారం సంవత్సరం జైలుశిక్ష, సెక్షన్‌ 156 (అనుమతి లేకుండా రైలు ఇంజన్‌లో, కోచ్‌ ఫుడ్‌బోర్డుపై ప్రయాణించి సెల్ఫీ తీసుకోవడం చేసిన వారికి) ప్రకారం రూ.5వందల జరిమానా లేదా 3 నెలల జైలు శిక్ష, సెక్షన్‌ 159 (రైల్వే నిషేధిత స్థలంలో రాంగ్‌పార్క్‌ చేసిన వారికి) ప్రకారం రూ.5వందల జరిమానా లేదా నెల జైలు శిక్ష, సెక్షన్‌ 160 (రైల్వే గేట్‌ను వాహనాలతో ఢీకొనడం, రైల్వే ప్రాపర్టీని ఢీకొనడం చేసిన వారికి) ప్రకారం 3 ఏళ్ల జైలు శిక్ష, సెక్షన్‌ 162 (లేడీస్‌ కోచ్‌లలో ప్రయాణించిన పురుషులకు) ప్రకారం రూ.5వందల జరిమానా, సెక్షన్‌ 164,165 (డేంజర్‌ గూడ్స్‌/ఎక్స్‌ప్లోజివ్‌ గూడ్స్‌– రైళ్లలో తీసుకెళ్లడం, గ్యాస్‌ సిలిండర్‌, కిరోసిన్‌, పెట్రోల్‌ లాంటి మండే స్వభావం గల వస్తువులు తరలించిన వారికి) ప్రకారం రూ. వెయ్యి జరిమానా లేదా 3 ఏళ్ల జైలు శిక్ష, రైలు టికెట్‌ లేకుండా ప్రయాణించిన వారికి) కింద రూ.5వందలు, వెయ్యి లేదా 6 నెలల జైలు శిక్ష, సెక్షన్‌ 167 (రైల్వే ప్రాంతంలో, స్టేషన్‌లో, రైళ్లో సిగరెట్‌ తాగిన వారికి) కింద రూ. వంద జరిమానా, సెక్షన్‌ 174 (ట్రైయిన్‌ సిగ్నల్స్‌ గాని రైల్వే సిగ్నల్‌ కేబుల్‌ డ్యామేజ్‌ చేసిన వారికి) కింద రూ . 2వేల జరిమానా లేదా 2 ఏళ్ల జైలు శిక్ష ఉంటుంది.

ప్రోత్సహించేందుకే రాష్ట్ర స్థాయి క్రీడలు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్‌ అధికారులు, పీడీలు

- ఎస్‌జీఎఫ్‌ఐ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ సత్యనారాయణ

నెల్లికుదురు : మారుమూల ప్రాంతాల నుంచి జాతీయ స్థాయి క్రీడల్లో ఎదిగేందుకే ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌జీఎఫ్‌ఐ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ, ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడల రాష్ట్ర పరిశీలకుడు కృష్ణమూర్తి విద్యార్థులకు సూచించారు. నెల్లికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్‌ఐ ఉమ్మడి వరంగల్‌ జిల్లా అండర్‌ 14, 17 బాలబాలికల నెట్‌బాల్‌ ఎంపిక పోటీలు, తపక్‌ సెక్రా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెట్‌ బాల్‌ క్రీడా ఎంపిక పోటీలో పాల్గొన్న 300 మందిలో 48 మంది విజేతలను గుర్తించి కేసముద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. తపక్‌ సెక్రా రాష్ట్ర స్థాయి అండర్‌ 17, 19 బాలబాలికల విభాగం క్రీడాపోటీ ఎంపికలో పాల్గొన్న 200 మంది క్రీడాకారుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 40 మందిని ఎంపిక చేసి ఈ నెల 23 నుంచి 25 వరకు నాగాలాండ్‌ రాష్ట్రం కోహిమా, మణిపూర్‌ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం విజేతలకు గోల్డ్‌, సిల్వర్‌, కాంస్య పతకాలతో పాటు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో క్రీడా నిర్వాహకులు సీహెచ్‌.అయిలయ్య, పీడీలు కొప్పుల శంకర్‌, సునీత, సురేశ్‌, వెంకన్న, ప్రణయ్‌, ప్రభ, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్‌ ఎంపికలు

వరంగల్‌ స్పోర్ట్స్‌: వరంగల్‌ స్విమ్మింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం బాలసముద్రంలోని డీఎస్‌ఏ స్విమ్మింగ్‌పూల్‌లో ఉమ్మడి వరంగల్‌ జిల్లా స్థాయి సబ్‌జూనియర్స్‌, జూనియర్స్‌ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి స్విమ్మర్లను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు తెలంగాణ స్విమ్మింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో డిసెంబర్‌ 7, 8వ తేదీల్లో భూపాలపల్లిలోని సింగరేణి స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించే 9వ తెలంగాణ వింటర్‌ ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ స్విమ్మింగ్‌ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు డిసెంబర్‌ 27 నుంచి 29 వరకు విజయవాడ, గాంధీనగర్‌లోని మున్సిపల్‌ కార్పొరేషన్‌ స్విమ్మింగ్‌ పూల్‌లో నిర్వహించే 35వ సౌత్‌జోన్‌ చాంపియన్‌షిప్‌నకు ఎంపికవుతారని తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో అసోసియేషన్‌ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌, డీఎస్‌ఏ స్విమ్మింగ్‌ కోచ్‌ రాయబారపు నవీన్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అసోసియేషన్‌ సెక్రటరీ స్వామిచరణ్‌

2,82,000 క్వింటాళ్ల పత్తి విక్రయం

- సీసీఐ కొనుగోళ్లు 1,20,659 క్వింటాళ్లు
- ప్రైవేట్‌ 1,61,341 క్వింటాళ్లు..

వరంగల్‌: ప్రస్తుత పత్తి సీజన్‌లో వరంగల్‌ జిల్లా పరిధిలోని మార్కెట్లు, సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఈ నెల 16 వరకు 2,82,000 క్వింటాళ్ల పత్తిని రైతులు విక్రయించారు. జిల్లా వ్యాప్తంగా 28 జిన్నింగ్‌ మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 26 జిన్నింగ్‌ మిల్లులను నోటిఫై చేసి ప్రారంభించగా ఆ కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి పత్తిని కొనుగోళ్లు చేశారు. సీసీఐ కేంద్రాల్లో 4618 మంది రైతుల నుంచి రూ.88.47కోట్ల విలువైన 1,20,659 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. అందులో 4610 మంది రైతులకు కనీస మద్దతు ధరలు లభించాయి. సీసీఐకి విక్రయించిన 4618 మంది రైతులకు గాను 2653 మందికి రూ.45.59కోట్లు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. మిగతా వారి ఖాతాల్లో డబ్బులు మూడు పనిదినాల్లో జమ చేస్తుందని మార్కెటింగ్‌ అధికారులు తెలిపారు. అలాగే, జిల్లాలోని మార్కెట్లలో ప్రైవేట్‌ వ్యాపారులు రైతుల నుంచి 1,61,341 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. పత్తి కొనుగోలు చేసిన వ్యాపారులు రైతులకు వెంటనే డబ్బులు చెల్లిస్తున్నారని అడ్తివ్యాపారులు తెలిపారు.

దిగుబడి తగ్గే అవకాశాలు..

ఉమ్మడి వరంగల్‌ జిల్లా వ్యాప్తంగా గతేడాది సాగు చేసిన పత్తి 36,50,000 క్వింటాళ్ల పత్తి దిగుబడి అయింది. ఈ ఏడాది సుమారు 5–10 శాతం విస్తీర్ణం తగ్గినప్పటికీ దిగుబడి గతేడాది కంటే పెరుగుతుందని వ్యాపారులు అంచనాలు వేశారు. కానీ అకాల వర్షాలతో పత్తి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్లు వస్తుందని రైతుల భావించగా ప్రస్తుతం 4–7 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. దీంతో రైతులు మొదటి కోతతో మొత్తం పత్తిని సేకరించి దాని స్థానంలో మొక్కజొన్న వేస్తున్నట్లు అధికారులు, వ్యాపారులు తెలిపారు.



పత్తి

తగ్గిన తేమతో గరిష్ట ధరలు..

ప్రస్తుతం విక్రయానికి వస్తున్న పత్తిలో తేమ శాతం తక్కువ నమోదు అవుతుండడంతో సీసీఐ ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తోంది. మార్కెట్‌కు బస్తాల్లో తెస్తున్న పత్తిలో తేమ నిర్దేశించిన మేరకు ఉంటే ప్రైవేట్‌ వ్యాపారులు సైతం సీసీఐ ధరలకు అటుఇటుగా చెల్లింపులు చేస్తున్నారు. దిగుబడి తగ్గుతున్నందున ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం..

- పస్రాలో ఘటన



వెంకటేశ్వర్లు(ఫైల్‌)

గోవిందరావుపేట: ఓ వ్యక్తి బైక్‌పై రోడ్డు దాటుతున్న క్రమంలో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని పస్రాలో జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పస్రా గ్రామానికి చెందిన మద్దారపు వెంకటేశ్వర్లు (55) బైక్‌పై పస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తున్నాడు. రోడ్డు దాటుతున్న క్రమంలో కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108 కి సమాచారం ఇవ్వగా ఆలస్యం కావడంతో ఓ ప్రైవేట్‌ వాహనంలో ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని సిబ్బంది తెలిపారు. కాగా, పలు ప్రమాదాలు జరుగుతున్న సమయంలో 108కు సమాచారం ఇచ్చినా చాలా ఆలస్యంగా వస్తున్నాయని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు 108 వాహన విషయంలో నిర్లక్ష్యం వదిలి, సకాలంలో స్పందించి క్షతగాత్రుల ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్‌ కింద పడి వ్యక్తి మృతి ..

కమలాపూర్‌: హుజూరాబాద్‌ మండలం ధర్మరాజుపల్లికి చెందిన మంద రవి (48) ట్రాక్టర్‌ కింద పడి మృతి చెందాడు. పోలీస్‌ ఇన్‌స్పెక్టర్‌ హరికృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొంద్ర కుమారస్వామి తన ట్రాక్టర్‌పై గడ్డి కట్టల పని కోసం శనివారం మంద రవిని తీసుకెళ్లి అదే రోజు రాత్రి వస్తున్నాడు. ఈ క్రమంలో కుమారస్వామి ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపాడు. దీంతో కమలాపూర్‌ మండలంలోని మాదన్నపేట శివారులో ట్రాక్టర్‌ మడ్‌గేర్‌పై కూర్చున్న రవి కింద పడిపోగా అతడిపై నుంచి ట్రాక్టర్‌ వెళ్లింది. దీంతో రవి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు వినేశ్‌ ఫిర్యాదు మేరకు కొంద్ర కుమారస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..



సమ్మయ్య(ఫైల్‌)

ములుగు రూరల్‌: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సర్వాపూర్‌ పంచాయతీ పరిధి జగ్గన్నగూడెంలో చోటు చేసుకుంది. జగ్గన్నగూడెం గ్రామానికి చెందిన రైతు కొట్టెం పెద్ద సమ్మయ్య (55) పంట చేనుకు నీళ్లు పారించేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కాగా, ప్రభుత్వం.. పెద్ద సమ్మయ్య కుటుంబాన్ని ఆదుకుని రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం నాయకుడు గుండబోయిన రవిగౌడ్‌ డిమాండ్‌ చేశారు.

కళాకారులతో కలిసి డ్యాన్స్‌ చేస్తున్న హీరో విశ్వక్‌సేన్‌



సినిమా సందడి

- ‘మెకానిక్‌ రాకీ’ ప్రీరిలీజ్‌ ఈవెంట్‌

హన్మకొండ చౌరస్తా: విశ్వక్‌సేన్‌, మీనాక్షి చౌదరీ, శ్రద్ధ హీరో, హీరోయిన్లుగా నటించిన ‘మెకానిక్‌ రాకీ ’ చిత్ర యూనిట్‌ ఆదివారం హనుమకొండలో సందడి చేసింది. హనుమకొండ ఇండోర్‌ స్టేడియంలో నిర్వహించిన ప్రీరిలీజ్‌ ఈవెంట్‌ అభిమానుల్లో ఉత్సాహం నింపింది. హీరో హీరోయిన్లు, ఇతర నటీనటులతో సెల్ఫీలు దిగేందుకు వారు పోటీ పడ్డారు. తారలతోపాటు నిర్మాతలు రామ్‌ తలూరి, రజనీ తల్లూరి, దర్శకుడు రవితేజ సినిమా విశేషాలను అభిమానులకు వివరించారు. ఈ సందర్భంగా హీరో విశ్వక్‌సేన్‌ అభిమానుల మధ్యకు చేరుకుని ఉద్వేగంగా మాట్లాడారు. ‘ఇప్పటి వరకు పది సినిమాలు చేశా.. మొదటి సారి టెన్షన్‌గా ఫీలవుతున్నా.. ఇది నా చివరి సినిమా. ఈ సినిమా ఆడినా.. ఆడకున్నా జూబ్లీహిల్స్‌లోనే ఉంటా.. ఇలాగే మాట్లాడుతా’ అని అన్నారు. తాను తినే ప్రతీ మెతుకు మీద అభిమానుల పేరుంటుందన్నారు. కార్యక్రమంలో వరంగల్‌ ఎంపీ కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, వేదికపై వరంగల్‌ ఎంపీ కడియం కావ్య